మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లి రూరల్ మండలం ఈశ్వరమ్మ కాలనీ, కోళ్ల బైలు పంచాయతీలలో దాదాపు రూ.1.20 కోట్ల వ్యయంతో మంజూరైన సిసి రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఈ పంచాయతీల అభివృద్ధి పట్ల ఎటువంటి చర్యలు తీసుకోలేదని, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసించే ఈ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, త్రాగునీటి బోర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అభివృద్ధి, సంక్షేమంలో ముందంజ

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ఎపి ముందంజలో ఉందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి పిజిఆర్ కల్యాణమండపంలో కార్యకర్తల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి 16 నెలల్లోని దేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంక్షేమం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. తల్లికి వందనం, స్త్రీశక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. రాయలసీమ ప్రాంతంలో మైనార్టీలు అధికంగా ఉన్నారని వారి కుటుంబాల్లో ఎంత మంది పిల్లలు బడికి వెళుతుంటే అందరికి తల్లికివందనం నిధులు జమ చేశారన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం వర్తింప చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. డిఎస్‌సి ద్వారా నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. రాయచోటి ప్రాంతంలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామానికితాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాయచోటి–చాగలమర్రి జాతీయ రహదారి పనుల విషయంలో కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు పూర్తి చేయడానికి కృషి చేశామన్నారు. అనంతరం గ్రామాల వారీగా కార్యకర్తల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్కిరెడ్డిపల్లి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీనాయక్, ఎపిఐఐసి డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఉమాపతిరెడ్డి, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు, యనమల మదనమోహన్, పోలీ సుబ్బారెడ్డి, బిసి నాయకులు విజయభాస్కర్, గాజుల ఖాదర్బాషా, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాంట్రాక్ట్ రాజు పాల్గొన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

రాయచోటి : తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని రాబోయే రోజులలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పెద్దశిక్ష అనుభవిస్తారని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత 15 నెలల నుంచి జరుగుతున్న పరిణామాల పట్ల మీకందరికీ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా గడిచిన ఐదు సంవత్సరాల్లో సుమారుగా 30 వేల మంది ప్రాణాలు బలిగొన్న అక్రమ మద్యం కేసులో అరెస్టయి 70 రోజులు జైల్లో ఊచర్ల లెక్క పెట్టి మిథున్‌రెడ్డి బయటకు వచ్చారని పేర్కొన్నారు. ఆయన నిర్దోషిని ఎక్కడ తెల్ల పేపర్ ఇవ్వలేదన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో రూ.3 వేల రూ.500 కోట్లు భారీ మద్యం కుంభకోణానికి మిథున్‌రెడ్డి ప్రధాన సూత్రధారి అని పేర్కొన్నారు. మద్యం కుంభకోణం జరగాలేదని అందులో నీ పాత్ర లేదని చెప్పే ధైర్యం అని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డికి, ఆయన తండ్రి రామచంద్రారెడ్డి ప్రభుత్వంలో మీరు ఏ విధమైన తప్పులు చేయకపోతే ఈరోజు ఈ దౌరాగ్యం మీకు ఎలా పట్టిందన్నారు. మీరు భారతదేశంలోనే ఎన్నో ఇంటర్నేషనల్ కంపెనీలు గత 30 సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో మద్యం వ్యాపారం చేస్తా ఉంటే అలాంటి కంపెనీలు అన్నీ మీకు పుడుపులు చెల్లించలేక సరసమైన మద్యం ఇక్కడ రాష్ట్రాన్ని విడిచి పెట్టి పోతే మీరు మీ సొంత కంపెనీ ద్వారా ఇక్కడ కంపెనీలు అప్పటికప్పుడే సృష్టించి అమ్మడం జరిగిందిన్నారు. ఇప్పుడు కేవలం బెయిల్ పైన వచ్చారని రాబోయే రోజులలో పెద్ద శిక్ష అనుభవిస్తారు అని హెచ్చరించారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కల్పనాయినిచెరువు కస్పాలో బుధవారం ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పరిశీలించారు. సచివాలయ సిబ్బంది గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి బయో మెట్రిక్ ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దనే వేలిముద్రలు తీసుకుని నగదును పంపిణీ చేయడం సంతృప్తి వ్యక్తం చేశారు. అనం తరం లబ్ధిదారులతో ఆయన స్వయంగా మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ ఎన్ని గంటల్లోపు అందుతుందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లను పారదర్శకంగా పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన మామిడి చెట్లను పరిశీలించారు. ఈ చెట్లకు వయసు ఎంత చెట్టు నడవ దానికి ఎంత మంది కూలీలు అవసర మయ్యారని, ఎన్ని పని దినాలు పట్టాయని, రావాల్సిన బిల్లులు అందాయా లేదా అని లబ్ధిదారులను, డ్వామా పీడీ వెంకటరత్నను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఇన్ పేషెంట్‌గా ఉన్న వ్యక్తిని ఆరోగ్యంలో వైద్య చికిత్స సక్రమంగా అందిస్తున్నారా లేదాని అడిగి తెలుసు కున్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ జాషువా, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

భర్త ఇంటిముందు భార్య నిరసన

- ఇంటి నుంచి గెంటేశాడని ఆవేదన
- 12 ఏళ్లుగా నరకం చూపుతున్నాడు..
- న్యాయం చేసి ఆదుకోవాలని వేడుకోలు

భర్త ఇంటిముందు నిరసన చేస్తున్న జోయాఖాన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వివాహమైన 12 ఏళ్లుగా తన భర్త నరకం చూపుతున్నాడు. రాజకీయ నాయకులతో తిరుగుతూ తనను పట్టించుకోవడం లేదు. మాట్లాడితే మద్యం సేవించి కొట్టడం, తిట్టడం, గొడవ చేస్తూ నా జీవితాన్ని అంధకారం చేశాడు. వారం రోజుల క్రితం నా బిడ్డను తీసుకొని ఇంట్లోంచి గెంటేసి, ఇంటికి తాళం వేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. పోలీసులు న్యాయం చేసి నన్ను ఆదుకోవాలని జోయఖాన్ అనే మహిళ తన తల్లితో కలిసి బుధవారం భర్త ఇంటి ముందు నిరసన దీక్షకు దిగింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ నా పేరు జోయఖాన్, నా భర్త పేరు మహబూబ్ ఖాన్, మాకు వివాహమై 12 సంవత్సరాలు అవుతోందన్నారు. తాము ఎస్‌బిఐ కాలనీలో నివాసం ఉంటున్నామని, నా భర్త ఓ రాజకీయ నాయకుడి దగ్గర అనుచరుడుగా ఉంటూ ఉదయం వెళ్లిపోయి అర్ధరాత్రి వరకు ఇంటికి రాడని తెలిపింది. ఏమని మాట్లాడితే వేదింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సంసార బాధ్యతలు పట్టించకోడని, బిడ్డ సంరక్షణను గాలికొదిలేశాడని వాపోయారు. వివాహమైనప్పటి నుంచి అనుభవిస్తున్నానని బోరున విలపించింది. పోలీసులను ఆశ్రయిస్తే రాజకీయ పలుకుబడితో నాకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. వారం రోజుల క్రితం నన్ను ఇంట్లోంచి గెంటేసి నా బిడ్డను తీసుకొని ఎక్కడికో వెళ్లిపోయాడని, అత్తమామలను అడిగితే పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించడం లేదని, ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో భర్త ఇంటి ముందే నిరసన దీక్ష చేస్తున్నానని చెప్పారు. పోలీసు అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని వేడుకుంది. అనంతరం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తామని రెండో పట్టణ సిఐ రాజారెడ్డి తెలిపారు.

రాజకీయాలకు మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి గుడ్ బై

ప్రజాశక్తి-పీలేరు

రాజకీయంగా పీలేరు పేరు చెప్పగానే వినబడేది జి.వి.కుటుంబం పేరు. సుమారు 70 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యమున్న కుటుంబం అది. ఆ కుటుంబం నుంచి జివి చంద్రశేఖర్‌రెడ్డి పీలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్, చిన్నగొట్టిగల్లు సమితి అధ్యక్షుడు, పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే, వేర్వేరు రాజకీయ పదవులను అనుభవించారు. ఆ తరువాత తన కుమారుడు జివి శ్రీనాథ్‌రెడ్డి రాజకీయ వారసుడిగా అరంగేట్రం చేశారు. ఈయన కూడా చిన్నగొట్టిగల్లు సమితి అధ్యక్షులుగా, చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్‌గా, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర స్థాయి రైతు నాయకుడిగా, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులుగా, ఇలా ఎన్నో పదవులు అనుభవించారు. బుధవారం రాత్రి ఆయన తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం తాను రాజకీయాల నుంచి స్వఛ్ఛందంగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జివి మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ జివి చంద్రశేఖర్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గం శాసనసభ్యుడుగా చేసిన ప్రజా సేవను స్వయంగా చూసి తాను న్యాయవాద వృత్తి నుంచి రాజకీయాల్లోకి అడుగు పెట్టానన్నారు. తాను తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ చిన్నగొట్టిగల్లు సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, పీలేరు శాసనసభ్యులుగా ఈ ప్రాంత అభివృద్ధికి అవిశ్రాంతంగా కష్టపడి ప్రజలకు సేవ చేశానన్నారు. తాను ఓ ప్రజా ప్రతినిధిగా ఎన్నో పథకాలను ప్రజల కోసం అమలు చేసి గ్రామ సీమల స్వరూపాన్ని మార్చగలిగాను. ప్రజా ప్రతినిధిగా ఎంత ఒత్తిడి ఉన్నా ప్రజలను సొంత వ్యక్తులుగా చూశానని చెప్పారు. వారికి నిత్యం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశానని తెలియజేశారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా, ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా నిజాయితీనే ధ్యేయంగా పనిచేశానని తెలిపారు. క్షేత్రస్థాయిలో వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటుంటే ప్రజా ప్రతినిధిగా నాడు తాను మంజూరు చేసిన పథకాలను చూస్తుంటే ఎంతో సంత ృప్తి కలిగేదని, తన దగ్గరకు వచ్చిన ప్రజలు కూడా వాటిని గుర్తు చేసినప్పుడు తనకు ఎనలేని సంతోషం కలిగేదన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడమే కాకుండా నా సొంత కుటుంబ సభ్యులుగా చూశానని గుర్తుకు చేశారు. అయితే తాను వివిధ కారణాలవల్ల పార్టీలు మారాల్సి వచ్చిందని, తాను ఏ రాజకీయ పార్టీలో వున్నా ఆయా నాయకులు నాకు సముచిత స్థానం, గౌరవం ఇచ్చిన వారిని గుర్తుకు చేసుకుని వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, అయితే ప్రస్తుతం వివిధ కారణాలవల్ల, ఆరోగ్య పరిస్థితుల కారణంగా రాజకీయాల్లో కొనసాగడం సాధ్యం కాక తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. రాజకీయాల నుంచి తాను తప్పుకున్నా, తనవల్ల అయ్యే సహాయ సహకారాలను అందిస్తుంటానని తెలియజేశారు. తనతో ఇన్నేళ్లుగా కలిసి నడచిన నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు కృత్ణతలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి

మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

విద్యుత్ సమస్యలపై సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై సమ్మెకు సిద్ధమని ఎపి విద్యుత్తు స్ట్రగుల్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ భవన్ ఆవరణంలో స్ట్రగుల్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సంవత్సర నుంచి అధికా రులకు, ప్రభుత్వానికి విన్నపాలు, రాయబారాలు, ఆందోళన కార్యక్ర మాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఎటువంటి చలనం లేకపోవడంతో 15 నుంచి విద్యుత్ సంస్థలో సమ్మెకు సిద్ధంగా ఉన్నామని స్ట్రగుల్ కమిటీ నిర్ణయించిందని చెప్పారు. సమావేశంలో స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ఎన్.శివశంకర్, డిస్కం అధ్యక్షులు ఎం.శివ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు జెవివి ఛాయాచిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-కడప అర్బన్

గాంధీ జయంతిని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక, సర్ సి.వి.రామన్ సైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఐటిఐ సర్కిల్ వద్ద ఈ నెల 2న గాంధీజీ జీవిత ఘట్టాలు, జీవిత సందేశం, స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో గాంధీజీ పాత్ర, వర్తమాన ప్రపంచానికి గాంధీజీ ఆవశ్యకతపై ఛాయా చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష సి.వి.రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో చైతన్యం పెంచాలని కోరుతూ ప్రత్యేక వినతి పత్రం గాంధీజీ విగ్రహానికి సమర్పించు కుంటామని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

అభివృద్ధిని అడ్డుకోవడమే వైసిపి అజెండా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అభివృద్ధిని అడ్డుకోవడమే వైసిపి కౌన్సిలర్ల అజెండా అని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్ దుయ్యబట్టారు. బుధవారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీ ఎ–గ్రేడుగా అవతరించి, దాదాపు రెండు లక్షల జనాభాతో విస్తరించిందన్నారు. 2021లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అప్పటి వైసిపి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల నామి నేషన్లు చించివేయడం, భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి మున్సి పాలిటీని కైవసం చేసుకుందన్నారు. పేరుకే కౌన్సిల్ ఏర్పడింది తప్ప, పట్టణాభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. తూతూ మంత్రంగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి, అభివృద్ధిని విస్మరించిందన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడం, మదనపల్లి ఎమ్మెల్యేగా ప్రజా నాయకుడు షాజహాన్‌బాషా ఎన్నికై బాధ్యతలు చేపట్టి 15 నెలలు గడుస్తున్నా, ఆయనతో కలిసి పనిచేయడంలో కౌన్సిల్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వాస్తవానికి ఎమ్మెల్యే మున్సిపాలిటీకి అఫిషియో మెంబరుగా వ్యవహరిస్తారని ఆయనకు కనీసం గౌరవం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 20 వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసి రామకృష్ణ కౌన్సిల్ సమావేశాలు కేవలం స్నాక్స్, టీ లు తాగడానికే పరిమితవుతోం దని ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని ఆయన సమర్థించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, దోమ లు బాగా వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, దీనిపై కౌన్సిల్ స్పందించకపోడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కౌన్సిల్ స్పందించి, ఎమ్మెల్యేని సమన్వయం చేసుకొని పట్టణాభివృద్ధికి చొరవ చూపాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామచంద్ర నాయుడు, రెడ్డప్ప, రమణ పాల్గొన్నారు.

ఎస్‌పికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాగవేణి దంపతులు

ఎస్‌పి చొరవతో స్వగ్రామానికి చేరిన మహిళ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి సూచించారు. బుధవారం స్వగ్రామానికి సురక్షితంగా చేరిన నాగవేణి జిల్లా ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ములకలచెరువు మండలానికి చెందిన బత్తల నాగవేణి అనే మహిళ ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లి అక్కడ అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. బాధితురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు వెంటనే చర్యలు చేపట్టి ఏజెంట్లను విచారించి అధికారులతో సమన్వయం చేసిన అనంతరం బాధితురాలిని స్వదేశానికి రప్పించినట్లు తెలిపారు. ఉపాధి కోసం బయట దేశాలకు వెళ్తున్న వారు ప్రభుత్వ అనుమతి పొందిన ఏజెంట్ల ద్వారానే వెళ్లాలని దళారులను నమ్మి మోసపోకూడదని సూచించారు. పాస్‌పోర్టు, వీసా, కాంటాక్ట్ పత్రాల కాపీలు కుటుంబ సభ్యుల వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలని, ఇబ్బందులు వచ్చిన వెంటనే ఇండియా ఎంబసీ లేదా జిల్లా పోలీసులను సంప్రదించాలని చెప్పారు. అలాగే కుటుంబ సభ్యులతో ఎల్లప్పుడూ సంబంధం కొనసాగిస్తూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

డ్రోన్ల వినియోగంతో ప్రయోజనాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు: వ్యవసాయ రంగంలో కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కలిగిన డ్రోన్లు వినియోగంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణ శివారులోని మట్టి రమణరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం ద్వారా రైతులకు సమయం ఆదా, నీటిపారుదల, మందులు పిచికారి చేయడం, విత్తనాలు వేయడంతో పాటు శ్రమ తగ్గించడం వంటి సుస్థిర అభివృద్ధి, రకరకాల ప్రయోజనాలు ఉంటాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 10 లక్షలు విలువ చేసే డ్రోన్ ను 80 శాతం రాయితీతో మంజూరైన డ్రోన్ పరికరాన్ని రైతు దేవి రెడ్డి రమణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎడిఎ వైవి రమణ రావు, ఎఒ రమాదేవి, ఎఇఒ నజీర్, విఎఎలు జహ్నవి, నీరజ పాల్గొన్నారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

అనిబిసెంట్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-మదనపల్లె

చారిత్రాత్మక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకురాలు, భారత స్వాతంత్ర్యోద్యమంలో హోమ్‌రూల్ ఉద్యమ నాయకురాలు డాక్టర్ బెసెంట్ జయంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులు అర్పించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ దేరంగుల శ్రీనివాసులు నేతృత్వంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ముందుగా కళాశాల ప్రాంగణంలోని బెసెంట్ హాల్లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదుట అనిబెసెంట్ సర్కిల్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కళాశాల సీనియర్ అసిస్టెంట్ కరీం పాల్గొన్నారు.

అనిబిసెంట్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్

భారతజాతి గుండె చప్పుడు మహాత్మాగాంధీ : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భారతజాతి గుండె చప్పుడు మహాత్మా గాంధీ అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సత్యం, అహింసలు గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలని పేర్కొన్నారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహము ఆయన ఆయుధాలని, కొళాయికట్టి, చేత కర్ర పట్టి, నూలు ఒడికి, మురికి వాడలు శుభ్రం చేసి,అన్నీ మతాలు ఒక్కటే నని చాటి చెప్పారన్నారు. అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య పాలనకు చమరగీతం పాడార న్నారు. లాల్ బహదూర్ శాస్త్రి దేశ రెండవ ప్రధానిగా భారతీయుల హృదయాలలో నిలిచిన అమరజీవి అని, జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని అందించారన్నారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల దేశభక్తి, చిత్తశుద్ధి, నిజాయితీ ,సేవా భావాలు అందరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. ఆ మహనీయుల అడుగుజాడల్లో నడచి వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యానికి గత జగన్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆద ర్శంగా నిలుస్తోందన్నారు. తమ హయాంలో పట్టణంలోని కలెక్టరేట్ వద్ద గాంధీజీ విగ్రహంతో పాటు జాతీయ రహదారిపై మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పర్యాటక రంగంలో విశిష్ట కృషికి పట్టాభిషేకం

- వైవీయూ పాలకమండలి సభ్యులు మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో పర్యాటక రంగానికి విశిష్టమైన కృషి చేసిన యోగివేమన విశ్వ విద్యాయం లలిత కళల విభాగం అధ్యాపకులు డాక్టర్ కోట మృత్యుంజయరావుకు పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు రావడం జిల్లా పర్యాటక రంగానికి పట్టాభిషేకం చేయడమేనని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక రంగ దినోత్సవ సందర్భంగా సెప్టెంబర్ 27వ తేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న మృత్యుంజయరావును జిల్లా రచయితల సంఘం బుధవారం కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అభినందన సభ ఏర్పాటు చేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మూల మాట్లాడుతూ కోట మృత్యుంజయరావు ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలపై, ఆలయ శిల్పాలు, కుడ్య చిత్రాలు, హస్తకళలు మొదలైన వాటి విశిష్టతను చాటుతూ ఇప్పటికే 60కి పైగా పరిశోధనాత్మకమైన వ్యాసాలు రాసి అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణలు చేయడం విశేషమన్నారు. రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ లేపాక్షి చిత్రకళపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్న మృత్యుంజయరావు జిల్లా పర్యాటక రంగ వైభవాన్ని చాటుతూ తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పుస్తకాలు ప్రచురించి జిల్లా కీర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. కడప రెడ్డి సేవా సమితి అధ్యక్షులు లెక్కల కొండారెడ్డి, కొండూరు జనార్ధన రాజు, రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలురెడ్డి శేఖర్‌రెడ్డి, చదలవాడ వెంకటేష్ మాట్లాడుతూ అధ్యాపకుడిగా, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ జాయింట్ సెక్రెటరీగా, ఇంటాక్ సభ్యులుగా, జిల్లా బాలోత్సవం ఉపాధ్యక్షులుగా మృత్యుంజయరావు చేసిన కృషిని కొనియాడారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కందిమల్ల రాజారెడ్డి, రంగస్థలం నటులు మధుబాబు, శాసన పరిశోధకులు ఎన్.మునికుమార్ మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయంలో లలితకళల విభాగాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ చిత్రకారులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని, చరిత్ర, సంస్కృతి, సాహిత్య,పర్యాటక రంగాలకు మృత్యుంజయరావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందించారు. పురస్కార గ్రహీత మృత్యుంజయరావు స్పందిస్తూ ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతను పెంచిందని, రాబోయే రోజుల్లో గండికోట గొప్ప పర్యాటక క్షేత్రంగా విరాజిల్లనున్నదని, ఈ జిల్లా పర్యాటక రంగానికి నా శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా రచయితల సంఘం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.



మృత్యుంజయరావును సన్మానిస్తున్న ప్రముఖులు

కలెక్టర్, ఎస్‌పిలను కలిసిన 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు: కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి ధీరజ్ కనుబిల్లిని పీలేరు ఎమెమల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి కలిశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా ఎమ్మెల్యే కలెక్టర్, ఎస్పీలను కలిసే అవకాశం లేనందున అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో బుధవారం ఎమ్మెల్యే వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరగాల్సిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులు గురించి కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు అర్హులందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందని పక్షంలో వారిని గుర్తించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

మాట్లాడుతున్న తాతంశెట్టి నాగేంద్ర

పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-చిట్వేలి

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఆదేశాలకు పార్టీని బలోపేతం చేయ డమే లక్ష్యమని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జన సైనికుల కృషి వల్లే కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పార్టీకి గుర్తింపు వచ్చిందన్నారు. ఇటీవల రాజుకుంట గ్రామం నుంచి ఆనాల సునీల్, కనకరాజు, లోకేష్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం పార్టీ స్థానికంగా మరింత బలపడేందుకు అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలోనే జనసేన అంటే చిట్వేలి, చిట్వేలి అంటే జనసేనగా పార్టీకి గుర్తింపు తేవాలన్నారు. ఆనాల సునీల్ మాట్లా డుతూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా అన్ని గ్రామాలలో జనసేన పార్టీ అభివృద్ధికి పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరితో చేయి చేయి కలిపి పార్టీ కోసం శక్తి వంచన లేకుండా అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. జనసేనానికి ఆశయాలకు అనుగునంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోగినేని మనీ, పగడాల చంద్రశేఖర్, ఆలం రమేష్, జగన్మోహన్, పగడాల వెంకటేష్, కిషోర్, కనకరాజు, జన సైనికులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ గ్రామసభ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గోపిదిన్నె సచివాలయంలో గురువారం భూ రీ సర్వేకు సంబందించి రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నుంచి గోపిదిన్నె పంచాయతీలో భూ రీ సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామ సభ నిర్వహించి రీ సర్వేపై రైతులు, భూ యజమానులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు, భూ యజమా నులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. **చిట్వేలి** :మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2026- 27 ఆర్థిక సంవత్సర ప్రణాళికలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తారని ఎపిఒ నాగరాజు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు సర్పంచ్, సెక్రటరీ మరియు ఫీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో మొదటి గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని ఆ గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు ,అధికారులు, ఉపాధి శ్రామికులు స్వయం సహాయక సంఘాలు ప్రజలు అందరూ పాల్గొనవలసిందిగా ఆయన తెలిపారు.

నేడు విజయదశమి ఉత్సవాలు

ప్రజాశక్తి-చక్రాయపేట

చక్రాయపేటలో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో గురువారం విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి(అడ్వకేట్)తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలనికోరారు.

మల్లన్న సన్నిధిలో పులివెందుల జెసిజె కోర్టు జడ్జి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రం తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ మల్లికార్జున స్వామిని బుధవారం కడప జిల్లా పులివెందుల జెసిజె కోర్టు జడ్జి ఎం.చంద్రశేఖర్ రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అధికార సిబ్బంది న్యాయాధికారికి సాదర స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసారు.

పులివెందుల జెసిజె జడ్జి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

పింఛన్ల సొమ్మును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని దేవళం వీధి, అప్పారావుతోట, 35వ వార్డు రాజా నగర్‌తో పాటు రూరల్ మండలం ఈశ్వరమ్మ కాలనీ, హరిజనవాడ, మిట్టమరి, ఎగువ మిట్టమరి, మేకల వాండ్లపల్లి ప్రాంతాల్లో అక్టోబర్ నెల పింఛన్లు పంపిణీ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, సహకలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రమీల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. **14వ వార్డులో..** పట్టణ పరిధిలోని 14వ వార్డు పరిధిలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను టిడిపి నాయకులు నాగూర్‌వలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. ప్రతి నెల ఒకటో తేదిన పింఛన్లను అందించి వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఎపి దేశానికే ఆదర్శమన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా సారథ్యంలో మదనపల్లి నియోజకవర్గ అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. **బి.కొత్తకోట :** మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగిందని ఎంపిడిఒ అబ్దుల్ షుకూర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శుల చేత పంపిణీ చేయ డం జరిగిందన్నారు. ప్రతి నెల మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్య క్రమం శరవేగంగా నిర్వహిస్తున్నామన్నారు. పెన్షన్ల పంపిణీలో సిబ్బంది అలసత్వం వహిం చరాద న్నారు.సకాలంలో పెన్షన్లు అందించి వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

మదనపల్లి :పింఛన్లు పంపిణీలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా

జిఎస్‌టిపై అవగాహన అవసరం : ఎంపిడిఒ

జిఎస్‌టిపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ భానుప్రసాద్

ప్రజాశక్తి- కలకడ

సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్లు, ట్రాక్టర్ పరిక రాలు, వ్యవసాయ పనిముట్లు ఎరువులు తది తర వస్తువులపై జిఎస్‌టిని 18 శాతం నుంచి 5శాతం తగ్గించినట్లు తెలిపారు. రైతులు కొన్న వస్తువులపై జిఎస్‌టి రేట్లు తగ్గిస్తు న్నారా లేదా అని తెలుసుకోవాలన్నారు. నూతన జిఎస్టిఇ ప్రకారం రూ.21 వేల నుంచి రూ.85వేల వరకు ట్రాక్టర్‌పై తగ్గుదల ఉంటు ందని చెప్పారు. రైతుల ఉపయోగించే డ్రోన్లపై రూ.61, 250లు తగ్గుదల ఉం టుందని, రోటవేటర్ పరికరాలపై రూ.5వేల నుంచి రూ.12,500 వరకు తగ్గుదల ఉంటుందని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలోఎఒ శ్రీనివాస్, పశు వైద్యాధికారలు, పంచాయతీ కార్యదర్శులు రైతులు పాల్గొన్నారు.

'వెలుగు'లో ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం

- హాజరైన సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వయోవృద్ధుల సమస్యల పరిష్కారం చేయడానికి ప్రాధాన్యత నిస్తామని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి పేర్కొన్నారు. బుధవారం వెలుగు సంస్థలో ప్రపంచ ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ హాజరు కాగా, గౌరవ అతిథులుగా నియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎన్.మునిగోపాల కృష్ణ, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ముని రత్నం, వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయ మోహన్ రెడ్డి, చైతన్యసేవా అధ్యక్షులు సంస్థ ఆనందన్ హాజరయ్యారు. సంస్థ ప్రాంగణంలో సేవా సదన్ కమ్యూనిటీ హాలుని సబ్ కలెక్టర్ ప్రారంబించారు. అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు సీనియర్ సిటిజన్లను, జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కోసం ప్రభుత్వం ప్రత్యేక హక్కులను రూపొందించడం జరిగిందని వాటిని అందరూ సద్విని యోగం చేసుకోవాలని కోరారు. అలాగే వయోవృద్ధులకు ఎలాంటి సమస్య లున్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ చట్టాలపైన అందరూ సంపూర్ణ అవగాహన పెంచుకో వాలన్నారు. జీవితాన్ని అవపోసన పట్టిన పెద్దలను నేడు సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ ఎన్.మునిగోపాల కృష్ణ మాట్లాడుతూ తాను రాష్ట్ర, జాతీయస్థాయిలో సీనియర్ సిటిజన్స్ సమస్యలపైన గళమెత్తి హక్కులు సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. పత్యేక కమిషన్ ఏర్పాటు చేసి న్యాయం చేయడంతో పాటు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. వెలుగు సంస్థ కార్యదర్శి ఉదయ మోహన్ రెడ్డి మాట్లా డుతూ నేడు వయోవృద్ధుల దినోత్సవం తమ సంస్థలో ఏర్పాటు చేసు కోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషిం చాల్సిన బాధ్యత బిడ్డలు తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వయో వృద్ధులు వెలుగు సంస్థ సిబ్బంది, వెలుగు వృద్ధాశ్రమం సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 9వరోజు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సప్తశతి పారాయణం, చండీ హోమం నిర్వహించారు. దసరా ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిశాల ఎదుట మహార్నవమి గుండ ప్రవేశ కార్యక్ర మాన్ని వైభవంగా నిర్వహించారు. యువత అగ్నిగుండంలో నడిచి వెళ్లారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్య క్షులు యంబలూరు నరసిం హస్వామి, ఉపాధ్యక్షులు మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రటరీ గెలివి నాగ సురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, వ నారాయణ, ఆలయ మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గెలివి మల్లికార్జున శెట్టి, సభ్యులు పాల్గొన్నారు. **నందలూరు** : మండలంలోని నాగిరెడ్డి పల్లి మేజర్ గ్రామపం చాయ తీలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవిని శరన్నవ రాత్రుల సందర్భంగా బుధవారం రాజ్యసభ సభ్యులు ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పిం చారు. వారిని ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం చండీ హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, ఉపా ధ్యక్షులు మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రటరీ గెలివి నాగసురేంద్రకు మార్, నరసిం హప్రసాద్, చంద్రశేఖర్, ప్రసాద్, ప్రదీప్, వైసిపి మహిళా మండలి అధ్యక్షులు పల్లె మాధవి, వైసిపి నాయకులు సోవి ంశెట్టి ప్రభాకర్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, కరిముల్లా ఖాన్, ముమ్మడిశెట్టి సుధాకర్, కాకి చంద్ర, మోదుగుల చంద్రశేఖర్, పాలగిరి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఎంపీ మేడా రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులు

ఆర్.ఓ.సి.నెం. 1146/A1/2011 తేది: 01.10.2025

మదనపల్లె పురపాలక సంఘము

బహిరంగ వేలము ప్రకటన

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ షాపింగ్ కాంప్లెక్స్ నందు క్రింద తెలిపిన ఖాళీగా వున్న షాపు రూములను G.O.MS.No.68 (MA&UD) ది: 31.05.2024, నందలి ఆదేశములు ప్రకారము నెలసరి అద్దెపై లీజుకు ఇచ్చుటకు ది: 10-10-2025 తేదిన %TENDER CUM AUCTION కార్యక్రమములో భాగంగా టెండరు నిర్వహించబడును. కావున సదరు TENDER CUM AUCTION నందు పాల్గొనదలచిన వారు ది: 09-10-2025 లోగ టెండరు రుసుము రూ. 100/-లను మున్సిపల్ ఖజానాలో చెల్లించి, మదనపల్లె పురపాలక సంఘం చే జారీ చేయబడిన టెండరు షెడ్యూలును ది: 10.10.2025 వ తేది ఉదయం 11:00 గం॥లు లోగా దాఖలు చేయవలెను. టెండరు దాఖలు పరచిన తదుపరి, టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరచి అదే రోజు బహిరంగ వేలము నిర్వహించబడును. ఒకటికన్న ఎక్కువ షాపు రూములు కావలసిన వారు ఒక్కొక్క షాపుకు ఒక్కొక్క టి విడివిడిగా టెండరు దాఖలు చేయవలెను.

వ.సం.	ఏరియా/ కాంప్లెక్స్	ఖాళీగా ఉన్న షాపురూముల నెంబర్లు							
		జనరల్		షెడ్యూల్ కులలు		షెడ్యూల్ తెగలు		వికలాంగులు	
		దిగువషాపు రూములు	మొదటి అంతస్తు షాపు రూములు	దిగువ షాపు రూములు	మొదటి అంతస్తు షాపురూములు	దిగువ షాపు రూములు	మొదటి అంతస్తు షాపురూములు	దిగువ షాపు రూములు	మొదటి అంతస్తు షాపురూములు
1	జే.కే.వీధి	-	27, 27ఎ, 28ఎ, 29, 29ఎ, 30,34,35,39	-	33, 33ఎ	-	-	-	-
2	ముగ్గురాళ్ళ వంక	30,31,32	34,37,38,44, 45,51,53, 61,63,64	-	-	-	-	-	-
3	చిత్తూరు బస్టాండు	10,11,15, 17, టాయిలెట్ రూమ్	18,19,20, 24,26,28, 29,30	16	22, 27	08	-	9	33
4	బెంగుళూరు బస్టాండు	-	35ఎ, 36ఎ, 38ఎ	-	40	-	-	-	-
5	కో-ఆఫ్ కాలనీ	5,6,8,10	-	11	-	9	-	-	-
6	సుభాష్ రోడ్డు	1							
7	కొత్తగా నిర్మించిన చిత్తూరు బస్టాండు	3							
8	ఆంధ్రకేసరి విపణికల్ప	08 (హోటల్)							

షరతులు:
1. దిగువ షాపు రూములు సాల్వెన్సి రూ॥100000/-లు మరియు రూ॥50000/-లకు ధరావత్తును, కమీషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడవు) సమర్పించవలెను.
2. మొదటి అంతస్తు షాపు రూములు సాల్వెన్సి రూ॥ 50000/-లు మరియు రూ॥ 25000/- లకు ధరావత్తును, కమీషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడువు) సమర్పించవలెను.
3. ఆంధ్రకేసరి విపణి కల్ప కాంప్లెక్స్‌లోని 08 (హోటల్)కు సాల్వెన్సి రూ॥ 10,00,000/-లు మరియు రూ॥5,00,000/- లకు ధరావత్తును, కమీషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడువు) సమర్పించవలెను.
4. టెండరు ఫారము పై నెలసరి అద్దెను స్పష్టముగా అంకెలు లోను మరియు అక్షరములోను తప్పనిసరిగా వ్రాయవలెను.
5. నెలసరి అద్దెపై ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు 18% శాతం GST అధనముగా చెల్లించవలసియుండును.

ఇతర వివరములు, షరతులు కార్యాలయ పనివేళయందు A1 వారిని సంప్రదించవచ్చును.

కమిషనరు
మదనపల్లె పురపాలక సంఘము

ఎంపీని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

ఎంపీని కలిసిన మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం : పీలేరు నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకులు బుధవారం ఎంపీ పెద్దిరెడ్డి మిథు న్‌రెడ్డిని కలిశారు. లిక్కర్ స్కాం కేసులో బెయిల్ పై విడు దలైన తిరుపతికి వచ్చిన ఎంపీని రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మైనారిటీ నాయకులు మహ మ్మద్అలీ, జాకీర్ కలిశారు. ఈ సందర్భంగా వారు మాటా డుతూ మాజీ సిఎం వై.ఎస్.జగన్ ఆశయాల సాధన కోసం అంకితభావంతో కృషి చేస్తామని, పెద్దిరెడ్డి కుటుంబం అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు.

మహారాజశ్రీ రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No. 10/2024

మద్దూరి గంగులయ్య, S/o నాగయ్య, వయస్సు 56 సం॥, R/o కొత్తకుంట హరిజనవాడ,H/o పొలిమేరపల్లె గ్రామము, టి.సుండుపల్లె మండలం, అన్నమయ్య జిల్లా మరియు ఇతరులు. ...అప్పిలెంట్స్

Vs

R5: మద్దూరి ఈశ్వరమ్మ, W/o సుబ్బరామ్, వయస్సు 45 సం॥, R/o కొత్తకుంట హరిజనవాడ, H/o పొలిమేరపల్లె. గ్రామం, టి.సుండుపల్లె మండల, అన్నమయ్య జిల్లా.
R7: జంగంపల్లె నాగవేణి, W/o వంశీ, వయస్సు 22 సం॥, R/o గువ్వల హరిజనవాడ, H/o శిబ్యాల, రాయచోటి మండలము, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్స్/R5, R7

నోటీసు

పై దావాలో అప్పిలెంట్లు మద్దూరి గంగులయ్య మరియు ఇతరులు రెస్పాండెంట్స్ అయిన కె.కాంతమ్మ మరియు ఇతరులపై అప్పీలు దాఖలు చేసియున్నారు. పై దావాలో 5వ రెస్పాండెంట్ మద్దూరి ఈశ్వరమ్మ మరియు 7వ రెస్పాండెంట్ జంగంపల్లె నాగవేణిపై అప్పీలు దాఖలు చేసియున్నారు. మీరు 6.10.2025 తేదీన ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.ఈశ్వరయ్య, M.Com.,B.L.,
టి.వి.రమణ, B.A.,B.L.,
అప్పిలెంట్స్ తరపున న్యాయవాదులు
రాయచోటి, అన్నమయ్య జిల్లా.

సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇటీవల కురుస్తున్న భారీ వర్షా లతో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని అర్బన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభు త్వాసు పత్రిలో బుధవారం శ్రీనాథ్ రెడ్డి మాట్లా డుతూ ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండ కుండా చూసు కోవాల న్నారు. మురుగుతో దోమలు ప్రబలుతాయని తెలిపారు. దోమ కాటు ద్వారా స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారని వివరిం చారు. దోమతెరలు తప్పక వాడాలన్నారు. వాతా వరణ ప్రభావ ంతో జలుబు, దగ్గుతో ఎక్కువ మంది బాధపడుతున్నారని తెలి పారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించానలి సూచించారు. ఇంటి లోని టైర్లు, టెంకాయచిప్పలు, కూలర్లలతో నీరు నిల్వ ఉంటే పారవేసి జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటి వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు కచ్చితంగా వేయించాలని వివ రించారు. సిబ్బంది కొరత గురించి అడగగా ఒక అటెండర్ కొరత ఉందని, అలాగే స్థానికంగా వాచ్మేన్ అవస రమని ఉన్నతాధి కారు లకు ప్రతిపాదన పంపామని తెలిపారు. ఆర్ఎంపిలు ప్రథమ చికిత్సఆలయాలు అని బోర్డు పెట్టుకోవచ్చన్నారు. పరిమితులకు మించి వైద్యం చేయరాదని, అవసరమైతే రోగులకు అర్హతగల వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు. స్టెరాయిడ్స్ వాడరాదని తెలిపారు.

కార్తీక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, కోచ్, అధ్యాపకులు

ఫుట్‌బాల్‌లో సత్తాచాటిన శ్రీవిద్యా వికాస్ విద్యార్థి

- రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఫుట్ బాల్ క్రీడలో పట్టణంలోని శ్రీ విద్యా వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికై సత్తాచాటాడు. బుధవారం కళాశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ఇర్రి శివశంకర్, కోచ్ బాలాజీల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మా కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి చదువుతున్న వి.కార్తీక్ ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణన్నారు. తమ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధనతోపాటు క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్తీక్ భవిష్యత్తులో జాతీయస్థాయి పుట్ బాల్ జట్టుకు ఎంపికై మదనపల్లి, ఎపికి పేరు ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. అనంతరం కోచ్ బాలాజీ మాట్లాడుతూ ఎస్‌జిఎఫ్ పుట్ బాల్ పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుండి మదనపల్లె నుంచిార్తీక్, చిత్తూరు నుండి జాకబ్ అనే విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పుట్ బాల్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇందుకు పీడీలు అన్వర్‌బాషా, నరేష్‌కుమార్, మహేంద్రనాయక్, మురళీధర్, మహేంద్రలు సహకారం ఎంతో ఉందన్నారు. ఈనెల 6నుంచి జమ్ముకాశ్మీర్‌లో జరిగే అంతరాష్ట్ర పుట్ బాల్ పోటీలలో ఈ విద్యార్థులు ఎపి జట్టు తరపున ఆడుతారన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి ఉమ్మడి చిత్తూరు జిల్లాల కీర్తిప్రతిష్టలు పెంచాలన్నారు. భవిష్యత్తులో మరింత మందిని పుట్ బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమన్నారు. అనంతరం విద్యార్థి కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పుట్ బాల్ జట్టుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. తన ఎంపిక వెనుక శ్రీ విద్యా వికాస్ కళాశాల ప్రిన్సిపాల్ శివ శంకర్, అధ్యాపకులు, కోచ్ బాలాజీ కృషి ఎంతో ఉందన్నారు. ఇదే స్పూర్తితో రాష్ట్రస్థాయి పోటీలలో రాణిస్తానని ధీమా వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.రెడ్డెప్ప నాయుడు, వై.గుణకర్ నాయుడు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రెడ్డిసర్ధజ్

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

పౌష్టికాహారం తీసుకుంటేనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రెడ్డిసర్ధజ్ తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వాల్మీకిపురం పరిధిలోని మహల్ సెంటర్ గడి అంగన్వాడీ కేంద్రంలో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం 2025 కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు పెరుగుదల గురించి,గర్భిణులు, ప్రసూతి తల్లు లకు ఐవిసిఎఫ్ గురించి అవగాహన కల్పించారు. పరిసరాలలో దొరికే ఆకుకూరలు, కూరగా యలు, రాగులు, సజ్జలు, జొన్నలు మనం తినే ఆహారంలో నిత్యం ఉండేలా చూడాలని అన్నా రు. కార్యక్రమానికి మహిళా పోలీస్, ఆరోగ్య కార్యకర్త, మాల్ సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి గురించి చర్చిద్దాం-నివారిద్దాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ :హెచ్‌ఐవి గురించి చర్చిద్దాం.. హెచ్‌ఐవి నివారిద్దామని స్నేహిత అమృత హస్త సేవాసమితి అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ కూడలి, పూలంగళ్ళ బస్టాండ్, బిఎస్‌ఎన్‌ఎల్, ఆర్‌టిసి, పాత బస్టాండ్, పుర వీధుల్లో ఎపి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఐఈసి టెంట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. టెంట్‌హౌస్ ముఖ్య ఉద్దేశ్యం వివరిస్తూ హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి నివారణపైన ప్రజలను చైతన్య పరుస్తూ, హెచ్‌ఐవికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. సీడీఎస్ మేనేజర్ వల్లి, నగీన్ బాషా, అనురాధ, పుష్పరాజ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమానాస్పద స్థితిలో ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాల ఉద్యోగి మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఆర్.కిషోర్ రెడ్డి(32) దుర్గా డాబాకు సమీపంలో వెనక వైపున ఉన్న హంద్రీ-నీవా కాలవలో పడి మృత్యువాత పడ్డాడు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాద వశాత్తు కాలువలో పడి మృతి చెందాడా లేక ఎవరైనా హత్య చేసి కాలువలో పడేశారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.ఈఘటనపై పోలీసులు ధర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చౌడేపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేం కు..బోయకొండ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు నిర్వహించే వై.జయరాం కుమా రుడు సునీల్ బైకులో బోయకొండ నుంచి మదనపల్లెకు బయల్దేరాడు. బోయ కొండ ఆర్చి వద్ద వేగంగా వచ్చిన ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో సునీల్ తలకు బల మైన గాయాలై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండ టంతో తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

సంబేపల్లిలో మరోవ్యక్తికి..

రాయచోటి టౌన్ : సంబేపల్లి మండలంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. రౌతు కుంట బోయపల్లికి చెందిన తన్నేరు వెంకటేష్ తన పనిమీద ద్విచక్ర వాహనం పై సంబేపల్లికి వస్తుండగా బోయపల్లె వద్ద ఆర్‌టిసి బస్సు ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆయనను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

9 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి 9 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు. బుధవారం కొండయ్యగారిపల్లి గ్రామం కొండయ్యగారిపల్లి వద్ద తొమ్మిది మంది వ్యక్తులు కలిసి పేక ముక్కలతో జూదం ఆడుతూ ఉండగా సమాచారం అందుకొని తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,100లు నగదును స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.